క్లుప్తంగా

అన్నదానం



అన్నదానం చేస్తున్న సోమశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని బృంద వృద్ధాశ్రమంలో కమలాపురం ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంతభాగాన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలకు వెచ్చించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. తమ కుటుంబంలో జరిగే వివిధ కార్యక్రమాలకు తాము ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆత్మ సంతృప్తిని ఇస్తోందన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు బాల సుబ్బయ్య, సుధారాణి పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప వైఎస్సార్ సర్కిల్ : భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షుడు మధు రెడ్డి, గౌస్ పీర్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



కమాల్‌బాషాను పరామర్శిస్తున్న కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : గుండెపోటుకు గురై అరుణాచల హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకుంటున్న నేపథ్యంలో 39వ డివిజన్ ఇన్‌చార్జి కమాల్‌బాషాను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె. సురేష్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా కమాల్‌బాషా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు ఎస్. యానాదయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

టోపీల కొనుగోలుకు విరాళం



కమిషనర్‌కు చెక్కును అందజేస్తున్న కళ్యాణ్ జ్యువెలరీస్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రతినిధులు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు క్లీన్ కడప టోపీలను కొనుగోలు చేయడానికి కళ్యాణ్ జ్యువెలరీస్ వారు రూ.50 వేలు, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారు రూ.లక్ష విరాళం అందజేశారు. మంగళవారం ఈ మొత్తాన్ని కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కళ్యాణ్ జ్యువెలరీస్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



రోగి పత్రాలను పరిశీలిస్తున్న డాక్టర్ మహబూబ్‌అలీ

కడప ఎడ్యుకేషన్ : కడపలోని మెడికేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మహబూబ్ అలీ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు రూ.7వేలు విలువ చేసే ఫైబ్రోస్కాన్ పరీక్షలను పలువురికి ఉచితంగా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్ అలీ మాట్లాడుతూ కాలేయం సక్రమంగా పనిచేస్తుందా లేదా అని ట్రాక్ చేయడానికి అవసరమైన పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించడం చాలా ముఖ్యం అన్నారు. కాలేయ సమస్య ఉన్న వాళ్లు తరుచుగా వైద్య పరీక్షలు చేసుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ వైద్య శిబిరంలో ల్యాబ్ అధినేత సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారిశాలలో ఈ నెల 24, 25, 25 తేదీలలో ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు జ్యోతిష్య విద్యాభాస్కర, దైవజ్ఞ రత్న ఆచార్య సాగి కమలాకర శర్మ నిత్య జీవితంలో శక్తితత్వం-ఉపాసన, శ్రీమద్భాగవతం - నిత్యజీవన సందేశం, మన దైవస్వరూపాల్లో శాస్త్రీయ అవగాహన అనే అంశాలపై ప్రవచనాలు చేస్తారని ఆయన వివరించారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



కడప నగరం కృష్ణాసర్కిల్ వద్దకు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అత్యంత సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలను పరిరక్షించటమే ధ్యేయంగా జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది మంగళవారం సాయంత్రం కడప నగరంలోని కృష్ణాసర్కిల్ వద్ద పోలీస్ సిబ్బందితో 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్‌ను నిర్వహించారు.

ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా హింసాత్మక చర్యలకు పాల్పడినా, ఎవరైనా అల్లర్లు చేస్తున్న సమయాల్లో ఎలా స్పందించాలి... జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదటగా వార్నింగ్ ఇవ్వడం, అది వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతితో టియర్‌గ్యాస్ ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ ఛార్జ్ ఆ తర్వాత ఫైర్ డిపార్ట్‌మెంట్ వారితో వాటర్ కెనాన్ ప్రయోగించడం , ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి డెమో ద్వారా ప్రదర్శించారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించేలా అల్లర్లు, గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్‌ఐ ఆనంద్, కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి, టూటౌన్ సీఐ ఇబ్రహీం, కడప రిమ్స్ సీఐ రామచంద్ర, చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, తాలూకా సీఐ తిమ్మయ్య, నగరంలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో మాట్లాడుతున్న కడప డిఎస్పీ ఎం. షరీఫ్



మాక్ డ్రిల్‌ను నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్ : కడప నగరంలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలోని బాసట చిల్డ్రన్స్ హోమ్‌లో ప్రవేశానికి అవసరార్థులు, అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకులు మేరువ బాలాజీరావు తెలిపారు. కడప నగరంలోని తమ చిల్డ్రన్స్ హోంలో తల్లిదండ్రులు లేదా ఇద్దరిలో ఎవరో ఒకరు లేకపోయిన ఇందులో ప్రవేశానికి అర్హులన్నారు. 5 నుంచి 15 సంవత్సరాల వరకు వయస్సు గల బాలురకు ప్రవేశం కల్పిస్తామన్నారు. మంచి చదువుతోపాటు భోజన, వసతి మెరుగైన సదుపాయాలతో క్రమశిక్షణ, విలువలతో పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న సదుద్దేశంతో ఈ హోమంను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 29 వ తేదీ లోపల పిల్లల పూర్తి వివరాలతో 81420 47682, 98494 89206 నెంబర్లలో లేదా హోంలో సంప్రదించాలని సూచించారు. సోమవారం కడప నగరానికి చెందిన సాయి ప్రియాంక, హేమానుదీప్‌లు చిల్డ్రన్స్ హోమ్ సభ్యుడు డి.కార్తీక్‌రెడ్డి ద్వారా రూ. 20వేలు విరాళం అందజేశారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా అన్నమయ్య సర్కిల్, క్రిష్ణా జంక్షన్, గోకుల్ లాడ్జి, దేవుని కడప రోడ్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జంక్షన్ వద్ద వెట్ మిక్స్ వేసి చదును చేయించాలని, క్రిష్ణా సర్కిల్ వరకూ ఏర్పాటు చేసిన కాలువపై హోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. డివైడర్ నందు గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. దేవునికడప రోడ్డులో ఉన్న మాచుపల్లి ప్లాజా వద్ద ఫౌంటేన్‌ను ఎప్పటికప్పుడు క్లీన్ చేయించాలన్నారు. స్లోప్ ఆధారంగా మార్బుల్స్ వేయాలని, ప్లాంటేషన్ చేయించాలని ఆదేశించారు. మార్కెట్ యార్డు జంక్షన్ వద్ద డ్రైన్‌కు రోడ్డుకు మధ్య ఉన్న గ్యాప్‌ను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

రేపు వరదరాజుల స్వామి కల్యాణోత్సవం

లింగాల : వెలిదండ్ల గ్రామ సమీపంలోని దేవర కోనలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత వరదరాజుల స్వామి ఆలయంలో గురువారం కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం గ్రామం నుంచి వరదరాజులస్వామి ఆలయం వరకు స్వామివారి ఆభరణాలు, పట్టువస్త్రాలు భాజా భజంత్రీలతో తీసుకువెళ్లి భూదేవి శ్రీదేవి సమేత వరదరాజులస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. ప్రతీ ఏటా మొలకల పౌర్ణమి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోందన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు స్వామి వారి కల్యాణంలో పాల్గొనాలని వారు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈనెల 23న పౌర్ణమి సందర్భంగా ఆలయంలో అమ్మవారికి 108 మంది ముత్తయిదువులతో విశేష అభిషేకం చేయనున్నారు. అనంతరం దీపాలంకార సేవ నిర్వహించనున్నారు.

మ్యాజిక్ వెనుక లాజిక్‌ను గమనిద్దాం



ఇంద్రజాల ప్రదర్శన ఇస్తున్న షామీర్‌బాష

కడప కల్చరల్ : మ్యాజిక్ కళ అందరికీ ఆసక్తి గొలుపుతుంది. చిన్నారులకు అయితే మరీ ఆనందాన్ని ఇస్తుంది. నిజానికి ఇది నిజం కాదు. అంతా హస్తలాఘవమేనని ఇంద్రజాలికులు షామీర్‌బాష అన్నారు. జన విజ్ఞాన వేదిక వేసవి శిక్షణా శిబిరం స్థానిక రామకృష్ణనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతోంది. అందులో భాగంగా మంగళవారం సంస్థ సీనియర్ సభ్యులు, ప్రముఖ మెజీషియన్ షామీర్ బాష చిన్నారులకు మ్యాజిక్ (ఇంద్రజాలం) గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు మ్యాజిక్ అంశాలను ప్రదర్శించి చిన్నారులను ఆశ్చర్యపరిచారు. కళల్లో ఇది చాలా చురుగ్గా వ్యవహరించాల్సినదని, మిగతా వాటితో పోలిస్తే కాస్త కష్టమైనదని వివరించారు. మూఢాచారాలు, నమ్మకాల వెనుక మ్యాజిక్‌యే ప్రధానమని తెలిపారు. ఈ సందర్భంగా పలు మ్యాజిక్ అంశాలను చేసి చూపించి వాటిని మాయలు, మంత్రాలుగా గ్రామీణ ప్రాంతాల్లోని మంత్రగాళ్లు అమాయక ప్రజలను ఎలా మభ్యపెడుతున్నారో వివరించారు. ఉత్సాహం చూపిన కొందరు విద్యార్థులతో స్వయంగా కొన్ని మ్యాజిక్ అంశాలను చేయించారు. మ్యాజిక్ వెనుక సైన్స్ దాగి ఉందని, ఆ శాస్త్రీయతను అలవర్చుకుంటే ఈ కళ బాగా పట్టుబడుతుందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కలశస్థాపన పూజలు

సిద్దవటం : మండలంలోని జెఎంజె కళాశాలకు ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం స్వామి వారికి కలశస్థాపన పూజలు వైభవంగా నిర్వహించినట్టు వేద పండితులు బ్రహ్మశ్రీ నైషధం ప్రతాప్ శర్మ, నైషధం రెడ్డి శర్మల తెలిపారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ నరసింహ జపం, దీక్షా హోమం, అభిషేకం, తీర్థప్రసాదాలు వితరణలు గావించారు. సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ, దీక్షా హోమం, నవగ్రహ జపం తదితర పూజా కార్యక్రమాలను చేసినట్టు వారు పేర్కొన్నారు. యజ్ఞం, హోమం పూజలకు నరశింగాళ్ల సునీల్ కుమార్ కామాక్షి దంపతులు, వారి కుమారులు సాయిహర్షిక్ కుమార్, సాయి హర్షిత్ కుమార్‌లు సహకరించారన్నారు. భక్తులు స్వామి వారికి దర్శించుకుని కాయాకర్పూరలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

శిక్షణా తరగతుల బకాయిలను చెల్లించాలి

డీఈఓకు యూటీఎఫ్ వినతి



సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి మర్రెడ్డి అనురాధకు వినతిపత్రాన్ని అందచేస్తున్న యూటీఎఫ్ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : సమగ్రశిక్ష పథక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా తరగతులకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌లు కోరారు. ఈ విషయమై మంగళవారం సమగ్రశిక్ష పథక ఇన్‌చార్జు జిల్లా అధికారి మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో మదనపల్లి కేంద్రంగా 10 విడతలుగా ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజులపాటు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులందరికీ రీడర్షిప్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణా తరగతులను నిర్వహించామన్నారు. ఈ శిక్షణా తరతులకు హాజరైన ప్రధానోపాధ్యాయులకు చెల్లించాల్సిన రవాణాభత్యం నేటికి చెల్లించలేదని ఎస్‌ఎస్‌ఏ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గత ఏడాది నవంబర్ నెలలో గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు, అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణా తరగతులకు సంబంధించిన బకాయిలను కూడా చెల్లించలేదన్నారు. సమగ్రశిక్ష పథకంలో పనిచేస్తున్న సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, సమగ్రశిక్షపథకం ఉద్యోగులందరికి గత మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. వారి బకాయిలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులందరికి రెండు రోజుల్లో వారి ఖాతాలకు జీతాలు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సివిరమణ, చంద్ర ఓబుల్‌రెడ్డి, మస్తాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఓ వైపు చెత్త... మరోవైపు మురుగునీరు



కో ఆపరేటివ్ కాలనీ నుంచి గంగమ్మ గుడికి పోయే మార్గంలో ఉన్న చెత్తాచెదారం, మురుగునీరు



కడప నగరంలో సంజన్న సర్కిల్‌లో పైపులైన్ వేసిన ప్రాంతంలో దెబ్బతిన్న తారు రోడ్డు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని కో ఆపరేటివ్ కాలనీ నుంచి ఎన్‌జీవో కాలనీలోని గంగమ్మ గుడికి పోయే మార్గంలో సీసీ రోడ్డుపై చెత్త వేయడం ప్రజలకు అసౌకర్యంగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి ఈ రోడ్డులో ఓ వైపు మురుగునీరు నిలిచి ఉండగా, మరోవైపు చెత్తాచెదారం వేశారు. దీంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డును బాగుచేయరూ...!

కడప నగరంలోని సంజన్న సర్కిల్ వద్ద ఇటీవల తాగునీటి పైపులైన్ కోసం రోడ్డును తవ్వారు. దానికి మరమ్మతులు చేయకుండా డస్ట్ మాత్రమే వేసి వదిలేయడంతో నిన్న కురిసిన వర్షానికి ఇదిగో ఇలా తయారైంది. పైపులైన్ తీసిన చోట గుంతగా మారడంతో బస్సులు, ద్విచక్రవాహనాలు, కార్లు ఇందులో 'ఢబేల్' మని పడుతున్నాయి. విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల రోడ్డుతోపాటు పైపు లైన్ కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా శేష వాహన సేవ



వెయ్యినూతల కోనలో శేష వాహన సేవలో కొలువైన లక్ష్మినరసింహస్వామి

పెండ్లిమర్రి : వెయ్యినూతలకోన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా శేష వాహన సేవ నిర్వహించారు. ముందుగా అష్టోత్తర శతకలశ స్నపనం, చతుస్థానార్చన, రాత్రి శేషవాహన సేవ వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు నరసింహస్వామి జయంతి

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మినరసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, వేద పారాయణం, మహామంగళ హారతి, సాయంత్రం హనుమత్ వాహనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కనుల పండువగా నత్తడ్‌షా వలీ ఉరుసు

ఖాజీపేట : ఖాజీపేట పట్టణ పరిధి అగ్రహారంలోని నత్తడ్‌షా వలీ దర్గా ఉరుసు ఉత్సవాలు రెండు రోజులుగా అత్యంత వైభవంగా జరిగాయి. మంగళవారం సర్వర్‌ఖాన్ పేట నుంచి జెండా మహోత్సవం జరిగింది. మసీదు నుంచి ప్రారంభమైన జెండా మహోత్సవం రాత్రి దర్గా వద్దకు చేరడంతో ముగిసింది. రాత్రి వేళ అన్వర్ ఖాన్, సర్‌ఫరజ్ సాబ్రీ చే నిర్వహించిన ఖవ్వాలి అందరినీ అలరించింది. పెద్ద ఎత్తున పిల్లలు, పెద్దలు దర్గా వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన ఊయలలు, రకరకాల ఆట పరికరాలతో పిల్లలు ఎంతో సంతోషంగా కటుంబ సభ్యులతో వినోదం పొందారు. భక్తులకు ఆటో శ్రీను అన్నదానం నిర్వహించారు.

ఘనంగా మారెమ్మతల్లి వారోత్సవం



ప్రత్యేక పూజలందుకుంటున్న మారెమ్మతల్లి

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మతల్లి అమ్మవారి తొమ్మిదవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, అమ్మవారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణ రాధా కోలాట బృందం వారిచే కోలాటం నిర్వహించారు. బుధవారం గ్రామ సుభిక్షం కోసం అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.

అర్హులనే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్వో గణేష్‌కుమార్

కమలాపురం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోటీలో వున్న అభ్యర్థులు జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్‌కు అర్హులైన వారిని మాత్రమే తమ ఏజెంట్లుగా నియమించుకోవాలని జాయింట్ కలెక్టర్, కమలాపురం రిటర్నింగ్ ఆఫీసర్ గణేష్ కుమార్ తెలిపారు. కమలాపురంలోని ఆర్వో కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి కేసులు లేని వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఫారం-18 పూర్తి చేసి ఇస్తే, వారి గురించి పరిశీలన చేసిన తరువాత అర్హులైతేనే అనుమతిస్తామన్నారు. కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్శిటీలో కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులతో పాటు కౌంటింగ్ ఏజెంట్లకు పాసులు మంజూరు చేస్తామని, అభ్యర్థులకు వెహికల్ పాసులను ఇస్తామని తెలిపారు. పాసులు పొందిన వారు ఆరోజు ఉదయం 7 గంటలకు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. కమలాపురం నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ ప్రక్రియకు 14 టేబుల్లు ఏర్పాటు చేస్తామని, మొత్తం 18 రౌండ్లలో కౌంటింగ్ పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో సుబ్రమణ్యం, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఘనంగా నిత్యకల్యాణ మూర్తుల బ్రహ్మోత్సవాలు



పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అర్చకులు

కమలాపురం : మండల పరిధిలోని శ్రీ రామాపురం క్షేత్రంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి సమేత మోక్షణ నారాయణస్వామి, శ్రీ వల్లీ దేవ సేన సమేత సుబ్రమణ్యస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు శ్రీ కాశీభట్ల సత్యసాయి నాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం గణపతి పూజ, మహా సంకల్పం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం యాగ శాల ప్రవేశం చేసి వివిధ హోమాలను నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం శ్రీ మోక్ష నారాయణస్వామికి హనుమద్వాహన సేవను నిర్వహించారు. శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి వృషభ వాహన సేవ నిర్వహించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

సిద్దవటం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి మండల అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం సాయంత్రం నాడు - నేడు, తాగునీరు, హౌసింగ్‌పై మండల ప్రత్యేకాధికారి సమీక్ష సమావేశం జరిగింది.